క్లుప్తంగా

విద్యార్థినుల సాయం



నగదును అందజేస్తున్న విద్యార్థినులు

కాశీబుగ్గ: మందస మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. ఎనిమిదో తరగతి చదువుతున్న సమయంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడంతో పైల కీర్తన, తెప్ప వెన్నెల, పైల హారికలకు మొదటి విడత స్కాలర్‌షిప్ రూ.12 వేల చొప్పున మంజూరైంది. దీంతో పాఠశాల అవసరాల కోసం తమవంతుగా ఆరు వేల రూపాయలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావుకు శనివారం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్ కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, దామోదరం గోపాలక్రిష్ణ, రమేష్ ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాం పై బాలల హక్కులపై చైల్డ్ హెల్ప్ లైన్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. బాలలు ఎక్కడ కనిపించినా వారితో ప్రేమగా మాట్లాడి వారి సమస్య, ప్రస్తుత పరిస్థితి తెలుసుకుని వారిని కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ జె.భాగ్యారెడ్డి, జాస్మిన్ కుమారి, బాల సరస్వతి, జీఆర్పీ సిబ్బంది అనితాకుమారి, జీవరత్నం, ఆర్‌పీఎఫ్ పోలీసులు సాహూ ఉన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



రుక్మిణిని అభినందిస్తున్న నాయకులు

సంతబొమ్మాళి: జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ ఎంపీపీ కర్రీ కృష్ణవేణి అన్నారు. పీజీ ప్రవేశ పరీక్షలో బోటనీ విభాగంలో మొదటి ర్యాంకు సాధించిన నౌపడ పంచాయతీ సీతానగరం గ్రామానికి చెందిన నీలాపు రుక్మిణిని శనివారం అభినందించారు. నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ బోటనీ విభాగంలో ఫస్ట్ ర్యాంకుగా నిలవడం అభినందియమని.. ఉన్నత విద్యకు ఎటువంటి సహాయం కావాలన్నా చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రీ విష్ణుమూర్తి, సీనియర్ జర్నలిస్ట్ కోట రాము రెడ్డి, టీడీపీ నాయకులు వాడరేవు కృష్ణారావు, సుగ్గు నాగిరెడ్డి, బచ్చల చిన్నబాబు, అనపాన నగేష్, దల్లి రాజు, కూర్మాపు రాంబాబు, సుబ్బారావు, సుగ్గు చిన్నారావు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



రేగులపాడులో పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

కోటబొమ్మాళి: పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. ఇందులో భాగంగా రేగులపాడు, కన్నేవలస, గుడివాడ గంగుపేట, గొల్లపేట, కొత్తపేట గ్రామాల్లో శనివారం 311 పశువులకు జబ్బవాపు,గొంతువాపు నివారణా టీకాలను ఏడీ మంద లోకనాథం ఆధ్వర్యంలో వేశారు. కార్యక్రమంలో కురుడు, తిలారు పశువైద్యులు ఎల్.కిరణ్‌కుమార్, ఎం.ప్రగ్నచైతన్య, వెటర్నరీ సహాయకులు ఎస్.శాంతారావు, కె.ముఖుందరావు, కె.ధర్మారావు ఉన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి: బడి ఈడు పిల్లలను తప్పకుండా పాఠశాలలో చేర్పించేందుకు, శతశాతం నమోదు సాధించేందుకు అందరూ కృషి చేయాలని హెచ్ఎం కె.చైతన్య కోరారు. మండలంలోని దండుగోపాలపురం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, మార్కండేయులు, రోజా, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

- లోక్ అదాలత్‌లో వక్తలు
- పలు కేసులు పరిష్కారం



టెక్కలి కోర్టు సముదాయంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జీలు

టెక్కలి: రాజీయే రాజమార్గమని వక్తలు అన్నారు. చిన్నచిన్న తగాదాలకు కోర్టులకెక్కి డబ్బును, సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. పలు కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది కేసులను పరిష్కరించారు. టెక్కలి కోర్టు సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 133 కేసులను పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి మల్ల ఆధ్వర్యంలో నిర్వహించిన అదాలత్‌లో పది సివిల్, 61 క్రిమినల్ , ఏడు ఎక్సైజ్, ప్లీ బార్గయినింగ్ ద్వారా 41, ఆరు చెక్ బౌన్స్, ఆరు మనోవర్తి, పీఎల్‌సీ, హిందూ మ్యారేజ్ ఓపీకి సంబంధించి ఒక్కో కేసును పరిష్కరించారు. అలాగే వివిధ కేసులకు సంబంధించి 35,69,610 రూపాయలు సెటిల్‌మెంట్ చేశారు. అదాలత్‌లో సభ్యులు ఎస్.రాజన్నాయుడు, ఎస్.దివాకర్, బి.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానందతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సోంపేటలో 33 కేసులు..

సోంపేట: రాష్ట్ర న్యాయ సేవాసంస్థ, అమరావతి వారి ఆదేశానుసారం సోంపేట కోర్టు సముదాయంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 33 కేసులను పరిష్కరించారు. అలాగే ముద్దాయిల నుంచి రూ. 3.5 లక్షలు జరిమానాను వసూలు చేశారు. ముందుగా వచ్చిన కక్షిదారులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి దీనిలో కొన్ని చట్టాలు, లోక్ అదాలత్‌ల ప్రాముఖ్యతను తెలియజేశారు. తర్వాత కోర్టులో రెండు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఒకటవ బెంచిలో సివిల్ జడ్జి(సీనియర్ డివిషన్) జె.శ్రీనివాసరావు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా, ఎ.కె.వి.వి. ప్రసాద్ అడ్వకేట్ మెంబర్‌గా, రెండో బెంచిలో సివిల్ జడ్జి (జూనియర్ డివిషన్)గా ఎ.రాము ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా, డి.ఉషారాణి అడ్వకేట్ మెంబర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సర్వేశ్వరరావు, సెక్రటరీ డి.జగన్నాథరావు, న్యాయవాదులు జి.ఎస్. శైలేంద్ర, కె.రాజేశ్వరరావు, ఎం.కృష్ణారావు, చలపతిరావు ఉన్నారు.

కోటబొమ్మాళిలో 181 కేసులు..

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 181 కేసులు రాజీ ద్వారా పరిష్కారం అయినట్లు జూనియర్ సివిల్‌జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత తెలిపారు. వీటిలో ఏడు సివిల్, ఆరు మనోవర్తి, 14 ఎక్సైజ్, 63 క్రిమినల్, 91 ఇతర కేసులు రాజీ అయ్యాయి. పలు కేసులో అపరాద రుసుంగా రూ. రెండు లక్షల 20 వేలు, రాజీ ద్వారా 29,38,130 రూపాయలు వసూలైనట్లు కోర్టు సిబ్బంది చెప్పారు. కార్యక్రమంలో ఏపీపీ డి.హరిప్రియ, ఏజీపీ ఎస్.తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, న్యాయవాదులు డి.నరసింహమూర్తి, వాన నేతాజీరావు, పల్లి వాసుదేవరావు, కె.అచ్చెన్నాయుడు, వి.అప్పలనాయుడు, సీహెచ్ వెంకటరావు, యు.తిరుమలరావు, కె.మన్మథరావు, కె.వెంకటరావు, బి.ధర్మారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో 35 కేసులు..

ఇచ్ఛాపురం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జికోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ 35 కేసులకు పరిష్కారం చూపారు. ఇందులో 24 రాజీపడ్డ కేసులు, మూడు మున్సిపల్, రెండు ఎంసీ, ఒక డీవీసీ కేసు, బ్యాంక్‌కి సంబంధించి ఐదు కేసులను జడ్జి పరిష్కరించారు. కార్యక్రమంలో సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజు, ఇచ్ఛాపురం, కవిటి ఎస్‌ఐలు సత్యన్నారాయణ, లక్ష్మణరావు, రాము, న్యాయవాదులు నాగరాజుపాత్రో, ఆల్లాడ నారాయణ, భగవాన్‌దాస్, సత్యన్నారాయణ, రాంబాబు, వరలక్ష్మి, వేణు, రమణయ్య, మురళి ఉన్నారు.



సోంపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం



కోటబొమ్మాళి: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత



ఇచ్ఛాపురం: కేసులను పరిష్కరిస్తున్న జడ్జి పరేష్‌కుమార్

రోటరీ సేవలు విస్తృతం



బాటచారులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలో 500 పైబడి సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకొన్నారు. రోటరీ ఆధ్వర్యంలో 85 రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి నిత్యం బాటసారులకు , ప్రయాణికులకు మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణాన్ని అందజేసి దాహాన్ని తీర్చుతున్నారు. ఏడాది పొడవునా చలివేంద్రం ద్వారా ప్రత్యేక ప్రణాళికతో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ముందుకు రావడం గొప్ప విషయంగా చెప్పవచ్చు. దీనిలో భాగంగా 85 రోజులు పూర్తయిన సందర్భంగా సోంపేట పట్టణం యశోద నగర్‌కు చెందిన దేవకి, దీపు, మాధవి, రమా, పూర్ణిమ, రాణిలు తమవంతుగా శనివారం ఈ చలివేంద్రం వద్ద వెయ్యి మంది బాటసారులకు మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణాన్ని అందజేసి బాసటగా నిలిచారు. అదేవిధంగా రోటరీ సభ్యులు డాక్టర్ ఇ.లక్ష్మీనారాయణ, దున్న రమేష్‌కుమార్‌తోపాటుగా పలువురు సభ్యులు అంధులకు పళ్లు, రొట్టెలను అందజేశారు. యాచకులు, అభాగ్యులకు ఆహార పదార్థాలను అందజేసి డాక్టర్ శ్రీనివాస్ బాసటగా నిలిచారు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనం



నవధాన్యాల సాగును వివరిస్తున్న సిబ్బంది

సోంపేట: జీడి మామిడి తోటల్లో అంతరపంటలుగా నవధాన్యాల సాగు చేయడంతో అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ గోవింద్ రెడ్డి అన్నారు. మండలంలోని పలాసపురం యూనిట్ పాలవలస పంచాయతీ పరిధిలో జీడిమామిడి తోటలో అంతర పంటలుగా నవధాన్యాల సాగుతో చేకూరే ప్రయోజనాలపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. మహిళా రైతులు సంగారు పద్మ, సుందరమ్మకు చెందిన రెండెకరాల జీడిమామిడి తోటలో పి.ఎం.డి.ఎస్. నవధాన్యాల సాగులో భాగంగా కందులు, రాగులు, గంటెలు, అలసందలు, గోరుచిక్కుడు, గోంగూర, జొన్నలు అంతర పంటలుగా వరుసలలో వేయించారు. ఈ విధంగా వేసుకోవడం వలన అదనపు ఆదాయం చేకూరడంతోపాటుగా నేల గుల్లబారి, నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరిగి తద్వారా ప్రధాన పంట జీడిమామిడి దిగుబడి కూడా పెరుగుతుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు కుమారి, శివానంద, తులసయ్య, కామరాజు, చిట్టిబాబు, ఐసీఆర్‌పీలు శ్రావణి, ప్రమీల పాల్గొన్నారు.

కల్యాణ వైభోగం



కల్యాణ వేడుకలో ఎమ్మెల్సీ రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు



వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బొడ్డబడ గ్రామంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని పండితుల వేద మంత్రాల సాక్షిగా అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, దంపతులతో సామూహిక కుంకుమ పూజలు చేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీపీ బోర పుష్ప, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌లు పాతిర్ల రాజశేఖరరెడ్డి, ప్రకాశరావు పట్నాయక్, మాజీ ఎంపీపీలు కారంగి మోహనరావు, నర్తు చామంతి, సర్పంచ్‌లు చల్లా విజయ లక్ష్మీ కృష్ణారెడ్డి, కారంగి త్రినాథ్, నర్తు వరప్రసాదరావు యాదవ్, పిట్ట బాలయ్య, పిలక సంతూ, పిట్ట మామయ్యరెడ్డి, ఇసురు తులసీరాం, ఆశి కృష్ణారెడ్డి, పటాన శ్రీనివాసరెడ్డి, దక్కత శ్రీరాములు, జి.చిరంజీవి రెడ్డి, లిట్టూపాడీ పాల్గొన్నారు.

'శివారు ఆయకట్టుకు వంశధార'

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలంలోని శివారు ఆయకట్టుకు సైతం ఈ ఖరీఫ్ సీజన్‌లో వంశధార జలాలు అందిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పాతటెక్కలి పంచాయతీ లింగాలపాడు వద్ద 60 ఆర్ఎల్ 90 పూడిక తీసే పనులకు ఆమె శనివారం శంకుస్థాపన చేశారు. కణితి వూరు నుంచి దేవునల్తాడ వరకు పూడిక తీసే పనులతో పాటు 60 ఆర్ఎల్, 5ఎల్ బెండి చానెల్ కాలువలో సైతం పూడిక తీసి కొండవూరు సీతాపురం ప్రాంత రైతులకు సాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వర్షాలు మొదలైనందున ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ పి.రమేష్ రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జి.వసంతరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గోవింద పాపారావు, పాతటెక్కలి మాజీ సర్పంచ్‌లు పిరియా రమణమూర్తి, శివప్రసాద్, పొల్లాడ మాజీ సర్పంచ్ అట్టాడ రఘుపతిరావు, ఎస్‌జేపురం సర్పంచ్ అఖిత్, కొమరల్తాడ మాజీ సర్పంచ్ దుర్రి నారాయణస్వామి, అపాకపరావు, యోగేష్ బాలర శేషగిరి ఉన్నారు.

ఘనంగా ఘటాభిషేకం



అభిషేక పూజల్లో భక్తులు

సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళి గ్రామంలో ఉమాపాలేశ్వరస్వామికి 1100 బిందెలతో సహస్ర ఘటాభిషేకాన్ని భక్తులు శనివారం నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని కోరుతూ ఏటా ఘటాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ అని భక్తులు తెలిపారు. అంతకు ముందు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఐసీడీఎస్ అధికారిణికి సత్కారం



శార్వాణి దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహిస్తున్న డి.శార్వాణి ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా శనివారం కాశీబుగ్గలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శార్వాణి, సత్యం దంపతులను సిబ్బంది దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో యూడీసీ అప్పారావు, సూపర్‌వైజర్‌లు గంగమ్మ, శ్రీలతమ్మ, సరస్వతి, జయమ్మ, ధనలక్ష్మి, సీహెచ్ ధానమ్మ, అరుణ, సునీత, కమలమ్మ, సుధారాణి, భవానీ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు తరపున సిబ్బంది అభినందించారు. ప్రాజెక్టు అధికారి డి.శార్వాణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శనివారం దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు గంగమ్మ, శ్రీలతమ్మ, సరస్వతి, జయమ్మ, ధనలక్ష్మి, సీహెచ్ ధానమ్మ, అరుణ, సునీత ఉన్నారు.

శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ

టెక్కలి: మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాల విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ నాప్‌కిన్స్‌ను శనివారం పంపిణీ చేశారు. ఇటీవల ఆస్పత్రి సౌజన్యంతో విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ సూచన మేరకు ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం చొరవతో విద్యార్థినులకు నాప్‌కిన్స్ అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



సాయాన్ని అందిస్తున్న పూర్వవిద్యార్థులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 12 వార్డు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తలగాన వెంకటరమణ అనారోగ్యానికి గురై శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి అనారోగ్యంతో బాధపడుతున్న తోటి స్నేహితునికి అండగా నిలవాలని భావించారు. 15 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని శనివారం వెంకటరమణకు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గత ప్రభుత్వాన్ని విమర్శించడం తగదు

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి



టీడీపీ కౌన్సిలర్‌తో వాదిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోనికి వచ్చిందని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం తగదని ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో ఎనిమిది అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ ఆమోదించింది. ఈ సమావేశం సందర్భంగా నిర్వహించిన జీరో అవర్‌లో నాలుగో వార్డు టీడీపీ కౌన్సిలర్ శేఖర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తన వార్డులోఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. దీనికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు భారతిదివ్య, స్వర్ణమణి స్పందిస్తూ.. మున్సిపాలిటీలోని 23 వార్డులలో చాలా అభివృద్ధి పనులు జరిగినప్పటికీ ఇటువంటి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం మున్సిపల్ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని పార్టీలకతీతంగా వాటిని పరిష్కరించడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఎదుటి వారిని రెచ్చగొట్టేలా మాట్లాడకూడదని చైర్‌పర్సన్ రాజలక్ష్మి అన్నారు. నీటి సమస్యతో సతమతమవుతున్న 1, 2, 3 వార్డుల పరిధిలోని పురుషోత్తపురం, ఏఎస్‌పేటకు క్రమం తప్పకుండా నీటిని ఎందుకు సరఫరా చేయలేకపోతున్నారని అధికారులను వార్డు కౌన్సిలర్ సుగ్గ ప్రేమ్‌కుమార్ నిలదీశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 4, 5, 6 వార్డుల్లో ఐరన్ విద్యుత్ స్తంభాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని.. లేదంటే ప్రమాదాలకు ఆస్కారం ఉందని ఆరో వార్డు కౌన్సిలర్ పరపటి మంజులత కమిషనర్ ఎన్.రమేష్‌ను కోరారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ



కాశీబుగ్గ: మందస మండలం లోహారిబందలో కిట్లు అందజేస్తున్న శేషగిరి



కాశీబుగ్గ: మామిడిపల్లిలో కిట్లు అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మందస మండలం లోహారిబంద గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్‌కిట్లను పంపిణీ చేశారు. వీటి సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. పంచాయతీ సర్పంచ్ రాపాక జానకమ్మ, గ్రామ పెద్ద రాపాక శేషగిరి పాల్గొన్నారు. అలాగే పలాస మండలం బొడ్డపాడు పంచాయతీ మామిడిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్టూడెంట్‌కిట్ల పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ తామాడ మదన్, గ్రామ పెద్దలు కిక్కర డిల్లీరావు, ఎంపీటీసీ సభ్యుడు పాపారావు, నాయకులు పత్రి తాతారావు, మద్దిల తిరుపతి పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: పిల్లలకు కిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు

ఇచ్ఛాపురం: పురుషోత్తపురంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. వార్డు కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, పత్రి తవిటయ్య, చాట్ల తిరుపతి, పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'మంచినీటికి ప్రాధాన్యమివ్వాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష, పక్కనే చైర్మన్ గిరిబాబు



సమావేశానికి హాజరైన సభ్యులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మంచినీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా 23 అంశాలతో అజెండా, 16 అంశాలతో కూడిన టేబుల్ ఎజెండాపై చర్చ జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని, రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కౌన్సిలర్లు ఆయా వార్డుల సమస్యలు విన్నవిస్తుంటే గత మూడేళ్లుగా ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని తెలుస్తుందని అన్నారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, కాలువల మరమ్మతులపై దృష్టి పెడతామన్నారు. మున్సిపల్ చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ.. కౌన్సిల్ సభ్యులంతా కలిసి ప్రజలు సమస్యలు పరిష్కరించుకోవాలని.. అందరూ అందుకు సహకరించాలని కోరారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ.. రూ.15 లక్షలు తాగునీటి బిల్లులు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సీదిరి అప్పలరాజు మంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు ఉచితంగా తన సొంత నిధులతో తాగునీరు అందిస్తానని చెప్పి ఇప్పుడు బిల్లులు పెట్టుకోవడం ఏమిటన్నారు. కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, ఆశాలత, జోగ త్రివేణి, కర్రి మాధవరావులు ఆయా వార్డులలో ఉన్నటువంటి సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు బోర క్రిష్ణారావు, మీసాల సురేష్‌బాబు, విప్ శంకర్‌పండా, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి నోడల్ అధికారుల నియామకం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో జూలై ఒకటో తేదీన ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నారు. వీటి పర్యవేక్షణ కోసం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 16 సచివాలయలకు పదహారు మంది నోడల్ అధికారులను నియమిస్తూ మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయాల వారిగా పరిశీలిస్తే మొగిలిపాడుకు జి.కనకరాజు, పద్మనాభపురానికి వై.అప్పలస్వామి, తాళ్లబద్రకు బి.అవినాష్, చినబడం సచివాలయానికి ఎస్.అప్పలరాజు, పెంటవీధికి ఎస్.వి. శివలక్ష్మి, పూజారివీధికి జి.అమరేశ్వరరావు, నర్సిపురం గ్రామానికి బి.శ్రీనివాసరావు, పద్మనాభపురం కాలనీకి పి.మనీషా, సూదికొండకు బి.వి.రమణ, గాంధీ నగర్‌కు సి.హెచ్.వి.వి.ఎస్.ఎన్.గుప్తా, న్యూకాలనీకి జి.యశోద, పురుషోత్తపురం-01కు పి.మోహనరావు, బత్తులవీధికి ఎస్.ఉమామహేశ్వరరావు, శ్రీనివాసనగర్‌కు పి.మోహన్, హరిజన వీధికి పి.స్వప్న, పురుషోత్తపురం-02కు బోర విజయకుమార్‌రెడ్డిలను నియమించారు.